# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 30-12-2022 RNI No.52865/93-Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 106 పేజీలు:6 వెల: రూ.1/-


## నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నగరంలో పోలీసులు ప్రత్యేక ఆంక్షలు

విశాఖ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నూతన సంవత్సర వేడుక ల్లో భాగంగా నగరంలో పోలీసులు ప్రత్యేక ఆంక్షలు విధించారు. డిసెంబర్ 31న సాయంత్రం 6 నుంచి ఉదయం 5 గంటల వరకు తెలుగు తల్లి ఫ్లైఓవర్, ఆర్కే బీచ్ రోడ్ లో పార్క్ హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. స్టార్ హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి ఒంటిగంట వరకే నిర్వహించాలని చెప్పారు. ఇక ద్విచక్ర వాహనాలు సైలెన్సర్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పుకొచ్చారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే ప్రదేశాల్లో డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు దొరికితే నిర్వాహకులపైన కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రోన్ కెమెరాలతో ఎక్కువమంది సిబ్బందితో, ఎక్కువ ప్రదేశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలునిర్వహించనున్నట్లు సీపీ తెలిపారు.

## జిల్లా స్థాయి యువజనోత్సవాలు

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)(;జాతీయ యువజన ఉత్సవాలు, 2023 లో భాగంగా జిల్లా యువజన మరియు క్రీడల అధికారి, రంగారెడ్డి జిల్లా కార్యాలయము వారు ఈ దిగువ తెలిపిన విభాగాలలో తేది: 03-01-2023 ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నారు.ఇండోర్ స్టేడియం, సరూర్ నగర్, రంగారెడ్డి జిల్లా కోర్ట్ ఎదురుగ, ఎల్ .బి నగర్ , హైదరాబాద్ నందు 1) జానపద సంగీతం (గ్రూప్), 2) జానపద నృత్యం (గ్రూప్), 3) ఉపన్యాసం /వక్తృత్వం మొదలగు అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా జిల్లా యువజన మరియు క్రీడల అధికారి,ఇ.వెంకటేశ్వర్ రావు తెలిపారు.

**పోటీలలో పాల్గొను అంశములు**

జానపద నృత్యం (గ్రూప్):జానపద నృత్యం (బృందం)లో గరిష్టంగా 20 మంది సభ్యులు గల బృందం 15 నిమిషాల గరిష్ట కాలపరిమితికి లోబడి ప్రదర్శించాలి . భారతీయ జానపద శైలికి సంబందించిన నృత్యాలు మాత్రమే అనుమతించబడును.

జానపద సంగీతం (గ్రూప్):: జానపద గీతాల (బృందం)లో గరిష్టంగా 10 మంది సభ్యులు గల బృందం 7 నిమిషాల గరిష్ట కాలపరిమితికి లోబడి ప్రదర్శించాలి. ( సినిమా పాటలు అనుమతించబడవు).ఉపన్యాసం/ వక్తృత్వం (హిందీ లేదా ఇంగ్లీష్ భాషలలో మాత్రమే) న్యాయ నిర్ణేతలు ఇవ్వబడిన కొన్ని అంశములలో నుండి ఒక అంశమును తీసుకోని గరిష్టంగా 4 నిమిషములు హిందీ లేదా ఇంగ్లీష్ బాషలలో మాత్రమే మాట్లాడవలెను. (ఎంచుకున్న అంశమును మార్చుడం జరగదు).

కబడ్డీ :(02) బాలురు మరియు (02) బాలికలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ద్వారా సెలక్షన్ ట్రైల్స్ నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుంది.

**ముఖ్య సూచనలు:**

15 సం.ల నుండి 29 సంవత్సరములలోపు వయస్సు కలిగిన రంగారెడ్డి జిల్లా యువతీయువకులు మాత్రమే పైన తెలిపిన పోటిలలో పాల్గొనుటకు అర్హులు.

జిల్లా స్థాయిలో ప్రధమ బహుమతి గెలుపొందినవారు రాష్ట్ర స్థాయిలో జరుగు పోటిలలో పాల్గొనుటకు అర్హులు. రాష్ట్ర స్థాయిలో జరుగు పోటిలలో ప్రధమ బహుమతి గెలుపొందినవారు జాతీయ స్థాయిలో జరుగు యువజనోత్సవలలో పాల్గొనవలసి ఉంటుంది.

ఆసక్తి గల యువ కళాకారులూ తమ బయోడేటా ను 02.01.2023 లోపు సంబందిత జిల్లా యువజన మరియు క్రీడల అధికారి, రంగారెడ్డి జిల్లా ఇండోర్ స్టేడియం, సరూర్ నగర్, రంగారెడ్డి జిల్లా కోర్ట్ ఎదురుగ, ఎల్ .బి నగర్ , హైదరాబాద్ లో ఇవ్వవలెను. ఇతర వివరములకొరకు ఫోన్ నెంబర్ : : 9848364143/ 9440946083 ను సంప్రదించగలరు.

## కందుకూరు మృతుల కుటుంబాలకు సీఎం జగన్ సంతాపం

**-మృతులకు రూ.2 లక్షలు, గాయపడ్డ వారికి రూ.50 వేల చొప్పున పరిహారం**

**అధికారులకు సీఎం ఆదేశాలు**

న్యూఢిల్లీ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కందుకూరు ఘటనపై సీఎం శ్రీ వైయస్.జగన్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మరణించిన కుటుంబాలకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

మరణించివారికి రూ.2 లక్షల చొప్పున , గాయపడ్డ వారికి రూ.50వేల చొప్పున పరిహారం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఢిల్లీ పర్యనటలో ఉన్న ముఖ్యమంత్రి ఆమేరకు అధికారులకు ఆదేశాలు జారీచేశారు ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అండగానిలుస్తామన్నారు.

## తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా వేణుగోపాలాచారి

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా సముద్రాల వేణుగోపాలాచారి నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ పదవిలో వేణుగోపాలాచారి రెండేండ్ల వరకు కొనసాగనున్నారు.నిర్మల్ జిల్లాకు చెందిన సముద్రాల వేణుగోపాలాచారి.. 1985 నుంచి వరుసగా 1996 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు.

1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత రాష్ట్ర మంత్రిగా వ్యవహరించారు. 1996 పార్లమెంటు ఎన్నికల్లో మంత్రిగా ఉంటూనే ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించిన వేణుగోపాలాచారి దేవేగౌడ, ఐకే గుజ్రాల్ మంత్రివర్గంలో సంప్రదాయేతర ఇంధనవనరుల శాఖ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 1998లో మరోసారి గెలిచి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా సేవలు అందించారు.

1999లో మూడోసారి ఆదిలాబాద్ ఎంపీగా గెలిచి 2004 వరకు కొనసాగారు. 2004 ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా ఓడిపోయిన ఆయన 2009లో కొత్తగా ఏర్పాటైన ముథోల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు

. 2012లో టీడీపీకి రాజీనామా చేసి తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో ముథోల్ నుంచి మరోసారి విజయం సాధించారు. 2013లో టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత 2014 ఎన్నిల్లో ఓటమి పాలయ్యారు. ఆ సమయంలో ఢిల్లీలో ప్రభుత్వ సలహాదారుగా కేసీఆర్ నియమించారు.

**చరిత్రలో నేటినిజం**



కం॥ నప్పెడి శీఘ్ర గానాలాచెద –
నప్పుట్టున తిరిగి తిరిగి యవధానులకే
గొప్పగ ఘనగౌరవమును
రప్పించిన కవన ధునిని "రమణా"కవీశున్ !!

(డిసెంబర్ 30 కొప్పరపు రమణ కవి జయంతి...)

–రాధశ్రీ
సెల్:9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## కందుకూరు దుర్ఘటన పట్ల ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర సంతాపం

**-ప్రతి కుటుంబానికి 2 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా**

**-తీవ్ర విచారం వ్యక్తం చేసిన రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్**

**-మృతుల కుటుంబాలకు చంద్రబాబు నాయుడు 10 లక్షల ఎక్స్గ్రేషియా**

న్యూ డిల్లీ/అమరావతి డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );డిసెంబర్ నెల్లూరు జిల్లా కందుకూరు దుర్ఘటన మీద దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మరణించిన ప్రతి కుటుంబానికి 2 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి 50 వేల రూపాయలు అందజేస్తామని ట్వీట్లో పేర్కొన్నారు.ఈ దుర్ఘటన తనను బాధించిందని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మరో వైపు రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కూడా ఈ దుర్ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అధికారులు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. ఇదిలా ఉండగా మృతుల కుటుంబాలకు చంద్రబాబు నాయుడు గత రాత్రి 10 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబానికి తెలుగుదేశం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చంద్రబాబు ప్రకటించడమే కాదు సభను కూడా రద్దు చేసుకున్నారు.

మరో వైపు ఈ ఘటన ప్రతీ ఒక్కరినీ కలచివేస్తోంది. గతంలో ఎపుడూ కూడా ఇలా జరగలేదు. రాజకీయ పార్టీల సభలకు వస్తూ యాక్సిడెంట్ అయి మరణించిన ఉదంతాలు ఉన్నాయి కానీ సభకు వచ్చి తొక్కిసలాటలో ప్రాణాలు వదలడం అంటే దారుణమే అంటున్నారు. దీంతో దేశమంతా ఈ ఘటన కలకలం రేపుతోంది.

మృతులకు అంతా సంతాపం తెలియచేస్తున్నారు.ఇదిలా ఉండగా నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి నిర్వహించిన రోడ్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు మహిళలు సహా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ రోడ్ షో కోసం కందుకూరు వచ్చిన ప్రతిపక్ష నేతను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. దాంతో జనం ఒక్కసారిగా ముందుకు తోసుకురావడంతో ఒక కాలువలో పడి అక్కడికక్కడే అయిదురుగు మరణించారు. మరో ముగ్గురు ఆసుపత్రిలో చనిపోయారు.

## ప్రజల కోసం ఆలోచించే వారే పరిపాలనకు అర్హులు : స్పీకర్ పోచారం



నిజామాబాద్, డిసెంబర్ 29:అనునిత్యం ప్రజల కోసం ఆలోచించే వ్యక్తులే పరిపాలన సాగిస్తారని, ఆరోపణలు చేసే వ్యక్తులు కాదని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా చందూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పోచారం మాట్లాడారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు.

తెలంగాణకు సహాయం చేయడంలో కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రైతులు ఇతరుల వద్ద అప్పు చేయవద్దనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధును అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవడం కాదు. బ్యాంకులో తమ లాభాలను డిపాజిట్ చేసే స్థాయికి ఎదగాలని సూచించారు. ఏ ప్రభుత్వాలైనా రైతులను నిర్లక్ష్యం చేస్తే పుట్టగతులు ఉండవుని వెల్లడించారు.2014లో రాష్ట్రంలో 56 లక్షల మంది రైతుల వద్ద 1.08 కోట్ల ఎకరాలు సాగుకు యోగ్యమైన భూమి ఉండగా నేడు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ద్వారా రైతుల సంఖ్య 70లక్షలకు పెరిగిందన్నారు. సాగుభూమి కోటి 53లక్షలకు పెరిగిందని వివరించారు.

ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తుందని తెలిపారు. అనంతరం రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి స్పీకర్ పోచారం శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి , బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ మామ పాకల హరినాథ్ రావు కన్నుమూత.. సీఎం కేసీఆర్ నివాళి

హైదరాబాద్, డిసెంబర్ 29:బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మామ పాకాల హరినాథ్‌రావు(72) గురువారం మధ్యాహ్నం గుండెపోటుకు గురై కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హరినాథ్.. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కేటీఆర్, ఆయన భార్య శైలిమ, ఇతర కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. అనంతరం హరినాథ్‌రావు మృతదేహాన్ని రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్‌లో ఉన్న ఆయన నివాసానికి తరలించారు.హరినాథ్‌రావు పార్థివదేహానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులర్పించారు. సీఎంతో పాటు ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్ కుమార్, మంత్రి మహమూద్ అలీ, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూడా నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు. మరికాసేపట్లో హరినాథ్ అంత్యక్రియలను నిర్వహించనున్నారు.



## చిత్రపురి కాలనీలో ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తా : మంత్రి తలసాని



హైదరాబాద్, డిసెంబర్ 29:తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటూ అభివృద్ధికి సహకరిస్తుందని సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సినీ పరిశ్రమలోని పెద్దల సహకారంతో బ్రహ్మాండమైన ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే ఇక్కడ బస్తీ దవాఖానాను ఏర్పాటు చేశామన్నారు.

ఇందులో ఉచితంగా వైద్య పరీక్షలు చేయడమే కాకుండా మందులు కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుందని చెప్పారు. చిత్రపురి కాలనీలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం, డూప్లెక్స్ ఇండ్లను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిత్ర పరిశ్రమలోని 24 విభాగాలలో ఉపాధి పొందుతున్న వేలాది మంది కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో సీనియర్ నటులు ప్రభాకర్ రెడ్డి కృషితో ప్రభుత్వం ఇక్కడ స్థలం కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. యూసుఫ్‌గూడ, రహ్మత్ నగర్, బొరబండ తదితర ప్రాంతాలలో సినీ కార్మికులు నివసిస్తున్నారని చెప్పారు.

మొదటి విడతలో 2632 ఇండ్లను అర్హులకు ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు 1176 డబుల్ బెడ్రూం ఇండ్లు, 180 డూప్లెక్స్ ఇండ్లను లబ్దిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. చిత్రపురి కాలనీలో రూ. 20 కోట్ల వ్యయంతో రోడ్లను నిర్మించడం జరిగిందని తెలిపారు.

ఈ కాలనీ వాసుల సౌకర్యార్థం రేషన్ షాప్‌ను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదే విధంగా నీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మిగిలిన కార్మికులకు కూడా ఇండ్లు నిర్మించి ఇచ్చేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి స్థలం కేటాయించే విధంగా కృషి చేస్తానని చెప్పారు.

సినీ పరిశ్రమలో అర్హులైన వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్రపురి కాలనీ అధ్యక్ష కార్యదర్శులు అనిల్, దొరై, లలితా, రామకృష్ణ, వెంకట్ యాదవ్, రఘు, దీప్తి వాజ్ పాయ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 4.4 శాతంకు పెరిగిన నేరాలు

**రాష్ట్ర పోలీసు వార్షిక నివేదికను విడుదల చేసిన డీజీపీ మహేందర్ రెడ్డి**



హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్ర పోలీసు వార్షిక నివేదికను డీజీపీ మహేందర్ రెడ్డి గురువారం విడుదల చేశారు. రాష్ట్రంలో నేరాల శాతం 4.4 శాతం కు పెరిగిందని పేర్కొన్నారు. సైబర్ నేరాలు 57 శాతం, దొంగతనాలు 7 శాతం, అపహరణలు 15 శాతం పెరిగాయని తెలిపారు. మహిళలపై నేరాలు 3.8 శాతం పెరిగాయని చెప్పారు. హత్య కేసులు 12 శాతం, అత్యాచారాలు 17 శాతం తగ్గాయి. 152 కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడిందని తెలిపారు. డయల్ 100 ద్వారా 13 లక్షల ఫిర్యాదులు వచ్చాయన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా 1.1 లక్షల ఫిర్యాదులు రాగా, పోలీసు స్టేషన్లలో 5.5 లక్షల ఫిర్యాదు నమోదయ్యాయని తెలిపారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. 15 లక్షల మందికి అవగాహన కల్పించామని చెప్పారు. గస్తీ వాహనాలు 7 నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకుని సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. హాక్ ఐ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో 10 లక్షలకు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా 18,234 కేసులు ఛేదించామని స్పష్టం చేశారు. వేలి ముద్రల ద్వారా ఎంతో మంది నిందితులను గుర్తించామని పేర్కొన్నారు. 10 లక్షల మంది అనుమానితుల వేలిముద్రలను సేకరించామని తెలిపారు. కరుడుగట్టిన నిందితులపై పీడీ చట్టం ప్రయోగించి నేరాలు అదుపు చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 431 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించామని తెలిపారు.

## పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 29:రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది ఏప్రిల్ 3న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్‌కు సంబంధించి ఎస్సెస్సీ బోర్డు అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది. పది పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కొనసాగనున్నాయి

**ఎగ్జామ్స్ టైమ్ టేబుల్ ఇదే..**

ఏప్రిల్ 3 – ఫస్ట్ లాంగ్వేజ్
ఏప్రిల్ 4 – సెకండ్ లాంగ్వేజ్
ఏప్రిల్ 6 –థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్)
ఏప్రిల్ 8 – గణితం
ఏప్రిల్ 10 – సామాన్య శాస్త్రం(ఫిజిక్స్, బయాలజీ)
ఏప్రిల్ 11– సాంఘిక శాస్త్రం
ఏప్రిల్ 12 –ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1
ఏప్రిల్ 13 – ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–2

**టెన్త్‌లో 6 పేపర్లే..**

పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వం భారీ సంస్కరణలు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఈ విద్యాసంవత్సరం నుంచి 11 పేపర్లను కుదించి, 6 పేపర్లకే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఒక్కో సబ్జెక్టులో 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. మిగతా 20 మార్కుల్ని ఫార్మెటివ్ అసెసెమెంట్‌కు ఇచ్చారు. 9వ తరగతి విద్యార్థులకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ జీవో 33 జారీ చేశారు. ఇదివరకు వ్యాసరూప, సూక్ష్మరూప ప్రశ్నలు రెండింటిలోనూ విద్యార్థులకు చాయిస్ ఇచ్చేవారు. కానీఇప్పుడు వ్యాసరూప ప్రశ్నల్లోనే చాయిస్ ఉంటుంది. సూక్ష్మ రూప ప్రశ్నలకు చాయిస్ వర్తించదు.

## తెలంగాణ ఇంచార్జ్ డీజీపీగా అంజనీ కుమార్



హైదరాబాద్, డిసెంబర్ 29: తెలంగాణ ఇంఛార్జ్ డీజీపీగా అంజనీకుమార్ నియామకం అయ్యారు. ప్రస్తుత డీజీపీ మహేందర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇంచార్జీగా డీజీపీగా అంజనీ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అంజనీ కుమార్ ఏసీబీ డీజీగా కొనసాగుతున్నారు.

ఇక రాచకొండ పోలీసు కమిషనర్‌గా డీఎస్ చౌహాన్‌ను నియమించారు. రాచకొండ సీపీగా కొనసాగుతున్న మహేశ్ భగవత్‌ను సీఐడీ అడిషనల్ డీజీగా నియామకం అయ్యారు. ఏసీబీ డీజీగా రవి గుప్తా నియామకం కాగా, విజిలెన్స్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా డీజీగా జితేందర్, లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా సంజయ్ కుమార్ జైన్ నియామకం అయ్యారు.

ఏసీబీ డీజీగా 2021, డిసెంబర్ 25వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్‌గా 2018 నుంచి 2021, డిసెంబర్ 24వ తేదీ వరకు కొనసాగారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీగా 2016 నుంచి 2018 వరకు సేవలందించారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీసుగా 2013 నుంచి 2016 వరకు పని చేశారు.

## నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా ధాన్యం కొనుగోలు : మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్, డిసెంబర్ 29:: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిజామాబాద్ జిల్లా నుంచి అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్రంలో కొనసాగుతున్న ధాన్యం సేకరణ వివరాలను గురువారం విడుదల చేశారు. అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో కొనుగోలు జరిగిందని వివరించారు.

ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో రూ .11వేల కోట్లు జమ చేశామన్నారు. 7011 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గానూ 4607 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తై మూసివేసామని తెలిపారు. నిన్నటివరకూ పది లక్షల నలబైవేల మంది రైతుల నుంచి 59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, దీని విలువ 12,051 కోట్లు ఉంటుందన్నారు.

# 4 లక్షల మందికి పెన్షన్లు ఎందుకు తొలగిస్తున్నారు?..

**-పెన్షన్ల తొలగింపుపై సీఎం జగన్‌కు పవన్ కల్యాణ్ లేఖ**
**-ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలి**
**-రూ.3 వేలు పెన్షన్లు ఇస్తామన్న హామీని ఈ విధంగా అమలు చేస్తారా?**
**-పెన్షన్ల తొలగింపునకు కారణాలు కూడా సహేతుకంగా లేవు**

అమరావతి డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : పెన్షన్ల తొలగింపుపై సీఎం జగన్ కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ లేఖ రాశారు. 4 లక్షల మందికి పెన్షన్లు ఎందుకు తొలగిస్తున్నారు? అని పవన్ ప్రశ్నించారు. పెన్షన్లు తొలగించేందుకే అధికారులు నోటీసులిచ్చారని, పెన్షన్ల తొలగింపునకు కారణాలు కూడా సహేతుకంగా లేవని పవన్ తెలిపారు. రూ.3 వేలు పెన్షన్లు ఇస్తామన్న హామీని ఈ విధంగా అమలు చేస్తారా? అని పవన్ మండిపడ్డారు. ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలని, అంతేకానీ పెన్షన్లు పెంచేందుకు లబ్ధిదారులను తగ్గించొద్దని పవన్ స్పష్టం చేశారు. మీ పాలనలో ఆర్థిక దివాళాకోరుతనాన్ని కప్పిపుచ్చుకోవడానికి పెన్షన్ల తొలగింపు చేపట్టడం ఏమిటి? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.

# పరీక్షల విధానంలో రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలు

**- తొమ్మిది, పదో తరగతుల పరీక్షలను కేవలం ఆరు పేపర్లతోనే పరీక్షలు**

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తొమ్మిది, పదో తరగతి పరీక్షల విధానంలో రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చింది. ఇక నుంచి తొమ్మిది, పదో తరగతుల పరీక్షలను కేవలం ఆరు పేపర్లతోనే పరీక్షలు నిర్వహించనున్నది. 2022-23 నుంచి సంస్కరణలను ప్రభుత్వం అమలులోకి తీసుకవచ్చింది. ఒక్కో సబ్జెక్ట్‌లో పరీక్షలకు 80, ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌కు 20 మార్కులు కేటాయించనున్నారు. సైన్స్‌పేపర్‌లో ఫిజిక్స్, బయాలజీ రెండింటికి సగం సగం మార్కులు కేటాయించింది. ఈ మేరకు పరీక్షల విధానంలో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. ఇంతకు ముందు కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రభుత్వం పది వార్షిక పరీక్షలను 11 నుంచి ఆరు పేపర్లకు కుదించిన విషయం తెలిసిందే. విద్యాశాఖ ప్రతిపాదన మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. తాజాగా తొమ్మిది, పది తరగతులకు ఆరేసి పేపర్లు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో తెలుగు, ఇంగ్లీష్, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులను రెండు పేపర్లుగా నిర్వహించేవారు. ఇక హిందీ సబ్జెక్ట్‌కు ఒకే పరీక్ష పరీక్ష నిర్వహించేవారు.

# తెలంగాణ టెక్స్‌టైల్ రంగానికి ఊతమివ్వండి

**– కేంద్రాన్ని కోరిన రాష్ట్ర చేనేత, జౌళీశాఖ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ టెక్స్‌టైల్ రంగానికి ఊతమివ్వాలని రాష్ట్ర చేనేత, జౌళీశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించాలన్నారు. నేతన్నల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, రాష్ట్రానికి మద్దతు ఇవ్వాలని కోరినా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కొన్నేళ్లుగా తెలంగాణకు అందుతున్నది శూన్యమని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు, సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌కు నిధులు ఇవ్వాలన్నారు. టెక్స్‌టైల్, చేనేతరంగంపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలన్నారు. బ్లాక్ లెవల్ హ్యాండ్‌లూం క్లస్టర్ల ఏర్పాటుకు నిధులు ఇవ్వాలన్నారు. టెక్స్‌టైల్, నేతన్నల పరిస్థితిపై కేంద్రానికి కనీస అవగాహన లేదని విమర్శించారు. నేతన్నల పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నానన్నారు

# ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తో ఉత్తరప్రదేశ్,ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల కోసం సెంట్రల్ టీబీ డివిజన్ మధ్య కుదిరిన చారిత్రాత్మక అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:దేశంలో క్షయ వ్యాధి వ్యాప్తిని అరికట్టి, వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తో ఉత్తరప్రదేశ్,ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల కోసం సెంట్రల్ టీబీ డివిజన్ మధ్య చారిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదిరింది. తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) లో భాగంగా ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ టిబి డివిజన్ (సిటిడి) మరియు ఉత్తర ప్రదేశ్ మరియు ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలలో క్షయ నిర్మూలన ప్రాజెక్టు అమలు చేయడానికి చేపట్టడానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, పెట్రోలియం, సహజవాయువు, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ. హర్దీప్ సింగ్ పూరి సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి.




దేశంలో నవెూదవుతున్న క్షయవ్యాధి కేసుల్లో ఎక్కువ శాతం పెద్ద రాష్ట్రాలు అయిన ఉత్తర ప్రదేశ్ మరియు ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల్లో నమోదవుతున్నాయి.

క్షయవ్యాధి కి కారణమవుతున్న వివిధ అంశాలను గుర్తించి, వివిధ దశల్లో వ్యాధిని గుర్తించడానికి అనువుగా టీబీ నిర్మూలన కార్యక్రమం రూపొందింది. సిఎస్ఆర్ లో భాగంగా ఐఒసిఎల్ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. వ్యాధిని ముందుగా గుర్తించి, వ్యాధి సోకిన ఇళ్ల వద్ద అత్యాధునిక పరికరాలతో రోగ నిర్ధారణ పరీక్షలు చేసి టీబీ నిర్మూలన కార్యక్రమం అమలు చేయడానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తన వంతు సహకారం అందిస్తుంది. వ్యాధిని ముందుగా గుర్తించడంతో పాటు . ఉత్తర ప్రదేశ్ మరియు ఛత్తీస్ గఢ్ ప్రజలందరికి ఉచిత అధిక-నాణ్యత టిబి చికిత్స, సంరక్షణ సేవలు అందించడం లక్ష్యంగా కార్యక్రమం అమలు జరుగుతుంది.

ఒప్పందంలో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 75 జిల్లాలో దాదాపు 64 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుంది.

కార్యక్రమం కింద మూడేళ్లపాటు సంవత్సరానికి ఒకసారి క్రియాశీల కేసులు గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారం అందిస్తుంది. దీనితో పాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలు కలిగిన 18 వాహనాలను ఇండియన్ కార్పొరేషన్ అందిస్తుంది. మారుమూల ప్రాంతాలు, రవాణా సౌకర్యాలు తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాలకు సులువుగా వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడానికి ఈ చర్య సహకరిస్తుంది. తక్కువ ఖర్చుతో వినూత్న మాలిక్యులర్ డయాగ్నోస్టిక్ యంత్రాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సమకూరుస్తుంది. మాలిక్యులర్ డయాగ్నోస్టిక్ సేవల ద్వారా ఉత్తరప్రదేశ్ గ్రామీణ ప్రాంతాలు, ఛత్తీస్ గఢ్ లోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో టిబి డయాగ్నోస్టిక్ సేవలు అవసరమైన వారికి అందుబాటులోకి వస్తాయి. వీటిని ఎక్కువ మంది ప్రజలు వినియోగించుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్న 18 సంచార వైద్య వాహనాలలో ట్రూనాట్ యంత్రాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుంది. యుపిలోని మొత్తం 8 ఆకాంక్షాత్మక జిల్లాల్లో పనిచేస్తున్న క్షయవ్యాధి యూనిట్లు, (బహ్రైచ్, బలరాంపూర్, చందౌలీ, చిత్రకూట్, ఫతేపూర్, శ్రావస్తి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సిద్ధార్థనగర్, సోన్‌భద్ర) మరియు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (అఊఅ)లలో 100 ట్రూనాట్ యంత్రాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అందిస్తుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 18 రాష్ట్ర ప్రధాన కార్యాలయాలు మరియు 8 ఆకాంక్షాత్మక జిల్లాలకు చేతితో తీసుకుని వెళ్ళడానికి వీలుగా ఉండే ఎక్స్‌రే యూనిట్లను లో అందిస్తుంది. ఛత్తీస్‌గఢ్‌లోని 5 డివిజన్లలో కూడా ఎక్స్‌రే యూనిట్లు సరఫరా చేస్తుంది.

ఒప్పందం పట్ల హర్షం వ్యక్తం చేసిన డాక్టర్ మాండవీయ క్షయవ్యాధి నివారణ కోసం జరుగుతున్న ప్రయత్నాలకు ఒప్పందం సహకరిస్తుందని అన్నారు. ' పరిపూర్ణ పరిపాలన విధానంలో భాగంగా రెండు మంత్రిత్వ శాఖలు అవగాహనతో పనిచేస్తున్నాయి. సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనకు అయిదు సంవత్సరాలకు ముందుగా దేశంలో క్షయవ్యాధి నిర్మూలన జరగాలి అన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ విధించిన లక్ష్యం చేరుకోవడానికి ఒప్పందం సహకరిస్తుంది' అని డాక్టర్ మాండవీయ అన్నారు. క్షయ వ్యాధి సోకిన వారిని ముందుగా గుర్తించి తగిన సమయానికి తగిన చికిత్స అందించడానికి ఒప్పందం సహకరిస్తున్నాదని మంత్రి అన్నారు.

2025 నాటికి దేశంలో క్షయవ్యాధి ని నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్న డాక్టర్ మాండవీయ ఈ దిశలో చర్యలు అమలు జరుగుతున్నాయని అన్నారు. దీనిలో భాగంగా ఇటీవల రాష్ట్రపతి నిక్షయ్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. " ప్రారంభించిన 15 రోజుల్లో భారతదేశంలోగుర్తించిన అర్హత పొందిన 12 లక్షల మంది టిబి రోగులకు పోషకాహార కిట్‌లు మరియు ఇతర సహాయాన్ని అందించే నిక్షయ్ కార్యకర్తలు అందించారు" అని ఆయన చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొనడానికి ముందుకు వచ్చిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కి శ్రీ హర్దీప్ సింగ్ పూరి కృతజ్ఞతలు తెలిపారు. ' దేశంలో ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ఆయిల్ రంగం సహకరించడానికి సిద్ధంగా ఉందని తెలియజేయడానికి ఈ ఒప్పందం ఒక నిదర్శనం ' అని మంత్రి అన్నారు. సిఎస్ఆర్ బాధ్యత నెరవేర్చడానికి పెట్రోలియం మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని అన్నారు.

# 30న స్వామివారి ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనాలు రద్దు

యాదాద్రి భువనగిరి డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్రంలో ప్రముఖ ఆలయమైన యాదాద్రిలో ఈ నెల 30న స్వామివారి ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనాలను అధికారులు రద్దుచేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మినరసింహ స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం.. ఉదయం సుప్రభాతం నుంచి మధ్యాహ్నం ఆరగింపు వరకు నిర్వహించే ఆర్జిత సేవలు, ప్రత్యేక, ధర్మదర్శనాలను రద్దు చేస్తున్నామని ఆలయ ఈవో గీత చెప్పారు. అదేవిధంగా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు బ్రేక్ దర్శనాలను కూడా క్యాన్సల్ చేస్తున్నామని వెల్లడించారు. నిత్యకైంకర్యాలను అంతరంగికంగా నిర్వహిస్తామని తెలిపారు. కాగా, ఇప్పటివరకు యాదాద్రీశ్వరుడిని నలుగురు రాష్ట్రపతులు మాత్రమే దర్శించుకోవడం విశేషం

# 2023 భారత ప్రభుత్వ అధికారిక కాలెండర్ ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్




న్యూఢిల్లీ, డిసెంబర్ 29:2023 సంవత్సరపు భారత ప్రభుత్వ అధికారిక కాలెండర్ ను కేంద్ర మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ కాలెండర్ ప్రధాని నరేంద్ర మోదీ విశ్వసించే ' సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' ను ప్రతిబింబిస్తుందన్నారు. చురుగ్గా పురోగతి చెందుతున్న భారతదేశాన్ని ప్రతిబింబించే 12 ఆకట్టుకునే చిత్రాలు కాలెండర్ లో ఉన్నాయన్నారు. 12 నెలలకు తీసుకున్న 12 భావనలు ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి అద్దం పడతాయన్నారు.

గత రెండేళ్లలోనూ కేవలం డిజిటల్ రూపంలోనే కాలెండర్ ముద్రించగా, మళ్ళీ ఇప్పుడు కాగితం మీద భౌతికంగా ముద్రించామన్నారు. ప్రభుత్వం రూపొందించిన అద్భుతమైన డిజైన్లలో ఇదొకటని మంత్రి అభివర్ణించారు. ఈ కాలెండర్ ను భౌతికంగానూ, డిజిటల్ రూపంలోనూ అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే మాధ్యమంగా ఇది అందరి ప్రసంశలందుకుంటుందన్నారు. అన్నీ గ్రామ పంచాయితీలకూ చేరటం ద్వారా మారుమూల ప్రజలకు సైతం కాలెండర్ లోని సందేశం అందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఇప్పటిదాకా సాధించిన విషయాలను ప్రస్తావించటంతోబాటు భవిష్యత్తు వాగ్దానాలను సైతం ఈ కాలెండర్ చెబుతుందని, అందుకే దీన్ని 'కొత్త సంవత్సరం, కొత్త సంకల్పం' అని పిలుస్తున్నట్టు తెలియజేశారు. దీన్ని హిందీ, ఇంగ్లిష్ తోబాటు 13 భాషలలో అందుబాటులో ఉంచుతామన్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకూ, పంచాయితీ రాజ్ సంస్థలకూ, ఆరోగ్య కేంద్రాలకూ, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలకూ, జిల్లా కలెక్టర్ల కార్యాలయాలకూ అందజేసి అక్కడే అమ్మకాలు సాగిస్తామని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా కొనుగోలు చేసేందుకు అందుబాటులో ఉంచుతామన్నారు. మొత్తం 11 లక్షల కాపీలు ముద్రించి అందులో 2.5 లక్షల ప్రాంతీయ భాష కాలెండర్లు పంచాయితీలకు పంపిణీ చేస్తారు.

మంత్రి శ్రీ ఠాకూర్ తమ మంత్రిత్వశాఖలోని వివిధ విభాగాలు సాధించిన ప్రగతిని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. 50 వ్యూహాత్మక ప్రదేశాలలో మినహా ప్రసార భారతి అన్ని అనలాగ్ టెరెస్ట్రియల్ ట్రాన్స్ మిటర్లనూ దశలవారిగా తొలగించింది. 2022 ప్రారంభం నాటికే డీడీ ఫ్రీడిష్ 4 కోట్ల 30 లక్షల ఇళ్లకు చేరగా, ప్రసార భారతికి చెందిన వేరు వేరు చానల్స్ మొత్తం 2 కోట్ల చందా దారులను సంపా దించగలిగాయన్నారు. ఈ ఏడాది దేశంలో అదనంగా 75 కమ్యూనిటీ రేడియో స్టేషన్లు ప్రారంభించగా వాటి మొత్తం సంఖ్య 397 కు చేరుకున్నదని చెప్పారు.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆటోమేషన్ ప్రక్రియ పూర్తయిందని, రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఆటోమేషన్ పురోగతిలో ఉన్నదని చెప్పారు. గడిచిన ఐదేళ్ల కాలంలో మంత్రిత్వశాఖ 290 మంది జర్నలిస్టుల కుటుంబాలకు జర్నలిస్ట్ సంక్షేమ పథకం కింద రూ.13.12 కోట్లు పంపిణీ చేసిందన్నారు.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ డైరెక్టర్ జనరల్ శ్రీ మనీష్ దేశాయ్ మాట్లాడుతూ కాలెండర్ థీమ్ 'కొత్త సంవత్సరం, కొత్త సంకల్పం' భారత ప్రభుత్వ పథకాలు, విధానాలకు, ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతకు అద్దం పడుతున్నదని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకూ కాలెండర్ పంపిణీ చేస్తామన్నారు. అదే సమయంలో సీబీసీ కి చెందిన మెయిలింగ్ విభాగం తపాలా శాఖతో కలసి 2.5 లక్షల గ్రామ పంచాయితీలకు ప్రాంతీయ భాషలలో ముద్రించిన కాలెండర్లను పంపిణీ చేస్తుందని శ్రీ దేశాయ్ చెప్పారు

### కాలెండర్ గురించి

సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేయాలన్న భారత ప్రభుత్వ ఆలోచనకు ఈ 2003 కాలెండర్ అద్దం పడుతుంది. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకునే చొరవలు నెలనెలా ప్రతిబింబిస్తాయి. ప్రభుత్వ విధానాలు, ఆశయాలు ప్రస్తావిస్తూ, బలమైన భారతదేశాన్ని తీర్చిదిద్దే ప్రయత్నం ఇందులో కనబడుతుంది.

### జనవరి

భారతదేశం అమృత కాలంలో ప్రవేశించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ రాజ్ పథ్ పేరును 2022 సెప్టెంబర్ లో కర్తవ్య పథ్ గా మార్చారు. సామ్రాజ్యవాద ఆలోచనాధోరణిని ఛేదించి మన దేశం పట్ల ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేస్తూ ముందుకు నడపటం కనిపిస్తుంది.

### ఫిబ్రవరి

ఫిబ్రవరిని రైతు కళ్యాణానికి, అంటే రైతు సంక్షేమానికి అంకితం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంగా చెప్పింది ఏంటంటే, రైతులు మన జాతికి గర్వకారణం. రైతుల సాధికారత ద్వారా సుసంపన్నమైన భారత్ నిర్మాణానికి ప్రభుత్వం అనేక పథకాలు వారికోసం అమలు చేస్తోందని.

### మార్చి

భారత మహిళల స్ఫూర్తిని గౌరవించే మాసం ? మార్చి. అదే నారీశక్తి స్ఫూర్తి. ప్రతి ఇంటా మహిళకు ధన్యవాదాలు చెబుతూ మనం మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాం. హద్దులు తుడిపేసి వాళ్ళకు వాళ్ళు ఎదుగుతూ సాటి మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన మహిళలందరినీ అభినందించాల్సిన మాసం ఇది. ఏటా మహిళా సాధకులను భారత ప్రభుత్వం 'నారీశక్తి పురస్కారం' తో సత్కరిస్తుంది.

### ఏప్రిల్

విద్యా సంస్కరణాలమీద దృష్టిపెట్టటం ప్రభుత్వ కీలక ఏజెండాలో భాగం. 'పఢే భారత్ బఢే భారత్' అనేది ప్రధాని నినాదం. అందుకే ఏప్రిల్ నెల అంశం 'నేర్చుకున్న భారత్'. నూతన విద్యా విధానం లాంటి సంస్కరణలతో ప్రాథమిక, సెకండరీ, ఉన్నత విద్యలో సమూలమైన మార్పులు తెచ్చింది. విద్యలో ఎదురు చూస్తున్న మార్పులు సాగుతున్నాయి.

### మే

నైపుణ్య భారత్ కార్యక్రమానికి అంకితమైన మాసం మే. జాతీయ నైపుణ్యాభివృద్ధి మిషన్ వివిధ నైపుణ్యాలలో 30 కోట్ల మందికి సంస్థాగతంగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశ యువతలో ఏ ఒక్కరూ సరైన నైపుణ్యం లేని కారణంగా తన శక్తి సామర్థ్యాలు వాడుకోలేని పరిస్థితి ఉండకూడదన్నదే ఈ మిషన్ లక్ష్యం.

### జూన్

ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినం జరుపుకుంటున్నారు. దేశంలో అన్ని వయోవర్గాల వారు చురుకైన జీవనశైలి కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోదీ 'ఫిట్ ఇండియా' ఉద్యమానికి పిలుపునిచ్చారు. అందుకే ఇంటింటికీ ఫిట్ నెస్ తీసుకెళుతూ జూన్ నెల అంశం 'ఫిట్ ఇండియా-హిట్ ఇండియా' అయింది.

### జులై

పర్యావరణ ఆరోగ్య ప్రస్తావన లేకుండా ఆరోగ్యం మీద ఏ చర్చా పూర్తి కాదు. వాతావరణ అనుకూల, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను భారత్ ఎంచుకోవటంలో భారత్ ముందున్నది. "తగ్గించండి, తిరిగి వాడండి, రీసైకిల్ చేయండి " నినాదాన్ని ప్రజలు తమ జీవన విధానంగా మార్చుకోవటానికి తగిన కార్యక్రమాలను ప్రభుత్వం రూపకల్పన చేసింది. –

### ఆగస్ట్

కేవలం ఒలంపిక్స్, కామన్వెల్త్ క్రీడల్లోనే కాకుండా దివ్యాంగుల అంతర్జాతీయ క్రీడలలో సైతం భారత క్రీడాకారుల అద్భుత ప్రదర్శన అందరినీ గర్వించేలా చేసింది. అందుకే ఆగస్టు థీమ్ 'ఖేలో ఇండియా'. క్షేత్రస్థాయిలో భారత క్రీడాకారులకు అండగా నిలబడటం మొదలు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల దాకా కల్పించి అనని క్రీడల్లోనూ భారత్ ను పోడియం మీద నిలబెట్టటానికి ఖేలో ఇండియా వాగ్దానం చేస్తోంది.

### సెప్టెంబర్

వసుధైవ కుటుంబకమ్, లేదా "ప్రపంచమే ఒక కుటుంబం" అనేది సెప్టెంబర్ థీమ్. భారతదేశపు జీ-20 అధ్యక్ష బాధ్యతకు ప్రాతిపదిక కూడా "ఒకే భూమి, ఒకే కుటుంబం , ఒకే భవిష్యత్తు" ఈ పురాతన భారతదేశపు సూత్రాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్నాం. ఏ ప్రయోజనమైనా, ఏ సమస్య అయినా అందరినీ, ఒకే విధంగా ప్రభావితం చేస్తుందని దీనర్థం. అందుకే భూమి మీద అందరి జీవన నాణ్యతను మెరుగు పరచటానికి మనం కృషి చేయాలి

### అక్టోబర్

అద్భుత విజయాలకోసం అర్రులు చాస్తున్నప్పుడే మనం దేశపు ప్రాథమిక అవసరాలను నెరవేర్చటం మీద దృష్టిపెట్టాలి. జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా ప్రభుత్వం భారతీయులందరికీ ఆహార హక్కు ఇచ్చినట్టయింది. అందుకే అక్టోబర్ నెల థీమ్"ఆహార భద్రత"

### నవంబర్

భారతదేశాన్ని ఆత్మ నిర్భర్ చేయాలన్న ప్రధాని ఆకాంక్షలకు ప్రతిస్పందనగా నవంబర్ నెల థీమ్ "స్వయం సమృద్ధ భారత్" అయింది. 2022 సెప్టెంబర్ 2 న ఐ ఎన్ ఎస్ విక్రాంత్ ప్రారంభంతో ఈ కల సాకారమైంది. కొచ్చి షిప్ యార్డ్ లో నిర్మితమైన ఈ నౌక భారత్ లో నిర్మించిన తొలి విమాన వాహక నౌక.

### డిసెంబర్

ఈశాన్య భారతదేశపు నిక్షిప్త ప్రతిభను, సంపదను వెలికితీసి అక్కడి జీవితాన్ని వెలుగుల మయం చేయటం మీద దృష్టి సారిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ఈశాన్య భారతదేశంలోని ఎనిమిది రాష్ట్రాలను అష్టలక్ష్ములుగా అభివర్ణించారు. భారత సుసంపన్నతలో ఈ ఎనిమిది రాష్ట్రాల వర్తకం, వాణిజ్యం, సహజ వనరులు వైవిధ్యమైన సంస్కృతికి ఉన్న ప్రాధాన్యాన్ని అది చాటి చెబుతుంది. సమ్మిళిత భారత్ లో ఒక ముందడుగుగా సూచిస్తుంది.

# సచివాలయానికి సంధానకర్తలుగా కన్వీనర్లు : మంత్రి జయరాం

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:గ్రామాలలోని సచివాలయానికి, ప్రజలకు సంధానకర్తలుగా సచివాలయ కన్వీనర్లు వ్యవహరిస్తారని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి క్యాంప్ కార్యాలయం నందు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్ చార్జి నారాయణస్వామి అధ్యక్షతన మాట్లాడుతూ తమ ప్రభుత్వం సచివాలయం వ్యవస్థ తీసుకొచ్చినప్పటి నుండి గ్రామాలలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలూరు, ఆస్పరి, దేవనకొండ మండలాల నుండి ఎంపీపీలు, జెడ్పిటిసిలు, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ నెంబర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, వార్డ్ నెంబర్లు, వాలంటరీలు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలను డీలర్ల ద్వారా కొనడం, అమ్మడంలో పారదర్శకత కోసం జి.ఎస్.ఆర్. 901(ఇ) ప్రకటన జారీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహించడానికి, నమోదిత వాహనాలను డీలర్ల ద్వారా కొనడం, అమ్మడంలో పారదర్శకత కోసం కేంద్ర రహదారి రవాణా ఉ జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ, 22 డిసెంబర్ 2022న జి.ఎస్.ఆర్. 901(ఇ) ప్రకటన జారీ చేసింది.

భారతదేశంలో ప్రి-ఓన్డ్ కార్ల విఫణి క్రమంగా పుంజుకుంది. ప్రి-ఓన్డ్ కార్ల క్రయవిక్రయాలతో ముడిపడిన ఆన్‌లైన్ వెబ్‌సైట్లు ఇటీవలి సంవత్సరాలలో పెరగడంతో ఈ విఫణి మరింత ఊపందుకుంది.

వాహనాన్ని మరొక వ్యక్తికి బదిలీ చేసే సమయంలో సమస్యలు, థర్డ్-పార్టీ నష్ట బాధ్యతలకు సంబంధించి వివాదాలు, ఎగవేతదారుల్ని గుర్తించడంలో ఇబ్బంది వంటివి ప్రస్తుత వ్యవస్థ కనిపిస్తున్నాయి.

కేంద్ర మోటర్ వాహన చట్ట నిబంధనలు- 1989లోని చాప్టర్ ఎఎఎని మంత్రిత్వ శాఖ సవరించింది. తర్వారా, ప్రి-ఓన్డ్ కార్ విఫణి కోసం సమగ్ర నియంత్రణ వ్యవస్థను రూపొందించింది.

ప్రతిపాదిత నియమాలకు సంబంధించిన ముఖ్యాంశాలు ఇవి:

1. డీలర్ ప్రామాణికతను గుర్తించడానికి నమోదిత వాహనాల డీలర్ల కోసం అధికారిక ధృవీకరణ పత్రాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది
2. నమోదిత యజమాని, డీలర్ మధ్య వాహనం మార్పిడికి సంబంధించిన సంపూర్ణ సమాచారం గురించి వివరించడం
3. నమోదిత వాహనాలను కలిగి ఉన్న డీలర్ అధికారాలు, బాధ్యతలను ఈ నిబంధనల్లో స్పష్టంగా పేర్కొనడం జరిగింది
4. తమ వద్ద ఉన్న మోటారు వాహనాల నమోదు ధృవపత్రం పునరుద్ధరణ/ఫిట్‌నెస్ పత్రం పునరుద్ధరణ, నమోదు ధృవపత్రం ప్రతి, ఎన్‌వోసీ, యాజమాన్యాన్ని బదిలీ చేయడం కోసం దరఖాస్తు చేసుకునే అధికారం డీలర్లకు ఉంది.
5. ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో, ఆ వాహనం ప్రయాణ ఉద్దేశం, చోదకుడు, సమయం, మైలేజ్ వంటి వివరాలతో ఒక రిజిస్టరును తప్పనిసరిగా నిర్వహించాలి, ఇది ఒక నియంత్రణ చర్య.

# మన ఊరు - మనబడి మోడల్ స్కూల్స్ ప్రారంభానికి సిద్ధం చేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

**-జనవరి 5లోగా పనులు పూర్తి కావాలి**
**- మన ఊరు మనబడి కార్యక్రమానికి నిధుల కొరత లేదు**
**- పనులు పూర్తయిన వెంటనే ఎఫ్.టి.ఒ.లను జనరేట్ చేయాలి**



సంగారెడ్డి, డిసెంబర్ 29 (నేటి నిజం ప్రతినిధి): జిల్లాలో మన ఊరు మనబడి లో చేపట్టిన మోడల్ స్కూల్స్ ను ప్రారంభించడానికి అన్ని హంగులతో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా తో కలిసి మన ఊరు మనబడి పనుల పురోగతి, ఎఫ్.టి. ఓ.ల జనరేట్, మోడల్ స్కూల్స్ పనుల పురోగతి, తదితర అంశాలపై కలెక్టర్ విద్య, ఇంజనీర్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నియోజకవర్గం వారీగా మన ఊరు మనబడి లో చేపట్టిన పాఠశాలలు, మోడల్ పాఠశాలల పనుల పురోగతి, పూర్తైనవి, ఇప్పటివరకు చేసిన పనులకు అప్లోడ్ చేసిన ఎఫ్ టి ఓల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని, పూర్తయిన పనులకు వెంట వెంటనే ఎఫ్ టి ఓ (పండు ట్రాన్స్ఫర్ ఆర్డర్స్) లను అప్లోడ్ చేయాలని సూచించారు.

మన ఊరు మన బడి లో చేపట్టిన 66 మోడల్ స్కూల్స్ పనులను జనవరి,5 లోగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఆయా మోడల్ స్కూల్స్ కు పెయింటింగ్, ఫర్నిచర్ , పాత్ వే, ప్లాంటింగ్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్ ఉండాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే ఇవ్వాలని ఎంఈఓ లకు ఆదేశించారు. మోడల్ స్కూల్స్ కు సంబంధించి పెయింటింగ్ తదితర పనులను చేయాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులదని స్పష్టం చేశారు. మన ఊరు మన బడికి నిధుల కొరత లేదన్నారు. పనులు చేసి ఎఫ్.టి. ఓ లు జెనరేట్ చేసిన వెంటనే నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ కింద ఎవరు మొదట ఎఫ్ టి ఓ లను అప్లోడ్ చేస్తే వారికి ముందుగా నిధులు విడుదల అవుతాయన్నారు. పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎంబి రికార్డులు నమోదు చేసి ఎఫ్.టి.ఓ జనరేట్ చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం డబ్బులు ఇస్తున్నా పనులు త్వరితగతిన చేయకపోవడం పై కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మైండ్ సెట్ మార్చుకోకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు నాణ్యతతో ఉండాలని, పాఠశాల పెయింటింగ్ అంశంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈజీఎస్, ఎస్ఎంసి పనులలో ఉన్న గ్యాప్స్ ను జనవరి 5లోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టులోని పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించి పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు.

ఏఈలు, సంబంధిత కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. మన ఊరు మనబడి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఫాలప్ చేయాలని అదనపు కలెక్టర్ రాజర్షి షా కు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేష్, ఇంజనీరింగ్ శాఖల ఈ ఈ లు, డి. ఈ.లు,ఎం ఈ ఓ లు, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో శాంతి స్థాపన ప్రక్రియలో ముందడుగు, కార్యకలాపాల విరమణ ఒప్పందం

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:'తిరుగుబాటు రహిత, సుసంపన్న ఈశాన్య ప్రాంతం' అన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విజన్‌కు అనుగుణంగా, కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో భారత ప్రభుత్వం, మణిపూర్ ప్రభుత్వం ఒక ఒప్పందం మీద సంతకం చేశాయి. ఒక దశాబ్దానికి పైగా క్రియాశీలంగా ఉన్న జెలియాంగ్‌రోంగ్ యునైటెడ్ ఫ్రంట్‌తో కార్యకలాపాల విరమణ ఒప్పందాన్ని ఇవాళ న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఇరు ప్రభుత్వాలు కుదుర్చుకున్నాయి. ఇది మణిపూర్‌లో శాంతి స్థాపన ప్రక్రియలో గణనీయమైన ముందడుగు. మణిపూర్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. బీరెన్ సింగ్ సమక్షంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, మణిపూర్ ప్రభుత్వ సీనియర్ అధికారులు, జెడ్‌యూఎఫ్ ప్రతినిధులు ఈ ఒప్పందం మీద సంతకం చేశారు.

జెడ్‌యూఎఫ్ ప్రతినిధులు హింసను వదిలేయడానికి, శాంతియుత ప్రజాస్వామ్య ప్రక్రియ భాగం కావడానికి అంగీకరించారు. ఈ ఒప్పందం ప్రకారం జెడ్‌యూఎఫ్ సాయుధ సభ్యులకు పునరావాసం కల్పిస్తారు. అంగీకరించిన నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు సంయుక్త పర్యవేక్షక బృందాన్ని ఏర్పాటు చేస్తారు.

# ఔషధ తయారీ యూనిట్లపై ఉమ్మడి తనిఖీలను ప్రారంభించిన సిడిఎస్‌సిఒ

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:కేంద్ర ఆరోగ్య ఽ కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖా మంత్రి డాక్టర్ మనసుఖ్ మాండవీయ ఆదేశాల ప్రకారం సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ -కేంద్ర ఔషధ ప్రామాణిక నియంత్రణ సంస్థ) స్టేట్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (రాష్ట్ర ఔషధ నియంత్రణ నిర్వహణ కింద గుర్తించిన ఉత్పత్తి యూనిట్లపై రిస్క్ ఆధారిత విధానంతో ఉమ్మడి తనిఖీలను నిర్వహించడం ప్రారంభించింది.

ఈ ఉమ్మడి తనిఖీలను దేశవ్యాప్తంగా ప్రామాణిక కార్యాచరణ విధానాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారు. తనిఖీలు, నివేదన ఽ తదనంతర చర్యలు డ్రగ్స్ ఽ కాస్మెటిక్స్ చట్టం, 1940, దానిలోని నిబంధనలకు అనుగుణంగా ఉండేలా నిర్ధారించే ప్రక్రియ కోసం ఇద్దరు జాయింట్ డ్రగ్ కంట్రోలర్లతో కూడిన కమిటీని సిడిఎస్‌సిఒ (కేంద్ర కార్యాలయం)లో ఏర్పాటు చేశారు. ఇది దేశంలో ఉత్పత్తి చేసిన ఔషధాలకు సంబంధించి అధిక నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కట్టుబడి ఉండేలా నిర్ధారిస్తుంది.

ప్రామాణిక నాణ్యత లేని (ఎన్ఎస్‌క్యూ)/ కల్తీ / నకిలీ ఔషధాల తయారీ ప్రమాదంలో ఉన్నట్టు గుర్తించిన ఉత్పత్తి యూనిట్ల దేశవ్యాప్త తనిఖీ కోసం ఒక కార్యాచరణ ప్రణాళికను తనిఖీల ముందు రూపొందించారు.

దేశంలో అందుబాటులో ఉన్న ఔషధ భద్రత, సమర్థత, నాణ్యతను నిర్ధారించడం ఔషధ నియంత్రణ లక్ష్యం.

తయారీ యూనిట్లు డ్రగ్స్ ఽ కాస్మెటిక్స్ యాక్ట్, 1940, దానిలోని నియమాలను ముఖ్యంగా మంచి ఉత్పత్తి లేదా తయారీ పద్ధతులు (జిఎంపి) అవసరాలకు అనుగుణంగా ఉండేలా నిర్ధారించేందుకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అవసరం.

# యు హావ్ డన్ గుడ్ జాబ్

**- సర్పంచ్ అడ్డిక జయపాల్ రెడ్డి, సెక్రెటరీ చందన లకు కలెక్టర్ అభినందన**

**- మీ లాంటి గ్రామాలు జాతీయ స్థాయి పురస్కారాలకు పోటీ పడాలి**

**- బిల్లులు సమర్పించిన వెంటనే నిధులను విడుదల చేస్తాం**

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): చెక్కపల్లి గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు బాగా చేశారనీ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సర్పంచ్ అడ్డిక జయపాల్ రెడ్డి, సెక్రెటరీ చందన లను అభినందించారు.

మీలాంటి గ్రామాలు జాతీయ స్థాయిలో పోటీ పడి అవార్డులు చేజిక్కించుకోవాలని అన్నారు.గురువారం వేములవాడ గ్రామీణ మండలం చెక్కపల్లి, నూకల మర్రి, బంజారు పల్లి లో ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన కాంపౌండ్ వాల్, త్రాగునీటి సరఫరా, ఎలక్ట్రిఫికేషన్, కిచెన్ షేడ్, ఇతర మరమ్మతు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెక్కపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.9 లక్షల 25 వేలతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజనీరు అమరేందర్ రెడ్డి నీ ఆదేశించారు. నిర్మాణం పూర్తి అయిన కిచెన్ షేడ్ ను పొగ త్వరగా వెళ్లేలా వెంటిలేషన్ ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలో ఖాళీ స్థలం అధికంగా ఉన్నందున తెలంగాణ క్రీడా ప్రగతి ప్రాంగణం ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.చెక్కపల్లి ఎంపీపీఎస్ ను మోడల్ స్కూల్ గా తీర్చిదిద్దాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయితీ నీ సందర్శించారు. జీపి కార్యాలయంలో ఎక్కువగా ఉన్న మెమెంటో లను చూసిన వాటి గురించి సర్పంచ్ ను వివరాలు అడిగారు. కబడ్డీ టోర్నమెంట్ లో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామం గెలుచుకున్న అవార్డులనీ జిల్లా కలెక్టర్ కు సర్పంచ్ తెలిపారు తెలిపారు.ఆసక్తిగా విన్న జిల్లా కలెక్టర్ పాటశాలలోనే అధునాతన కబడ్డీ కోర్ట్ ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కబడ్డీ అభివృద్ధికి కోసం ఏదైనా ప్రణాళిక తో వస్తే ఆర్థిక సహకారం అందిస్తామని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ నూకల మర్రి గ్రామంలోనీ జెడ్ పి హెచ్ ఎస్ ,ఎంపీపీఎస్ లో రూ. 26 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి నీ పరిశీలించారు. పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. జిఖఊటా లో లైబ్రరీ నిర్వహణ బాగాలేదని విద్యార్థులకు అనువుగా ఉండేలా మార్పులు చేయాలన్నారు.ఎంపీపీఎస్ స్కూల్ లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించి విద్యార్థులనుఅభినందించారు. పాటశాల ఆవరణలోనే ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులు, గర్భిణీలకు అందిస్తున్న సేవలను నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు.

తీవ్ర ,అతి తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న విద్యార్థుల గురించి, వారికి అందుతున్న పోషకాహారం గురించి నిర్వాహకులను ప్రశ్నించారు.అనంతరం జిల్లా కలెక్టర్ బాలరాజు పల్లె ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. ఇక్కడ ఆశించిన విధంగా పనులను జరగడంలేదని.. ప్రత్యేక దృష్టి సారించి పనులను పూర్తి చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన కిచెన్ షెడ్ కు వెంటనే ప్లాస్టరింగ్ చేయాలన్నారు.

పాటశాల ఆవరణలోని బావిలో బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.

మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పెద్ద వర్క్ లను, నరేగా ద్వారా పాఠశాలల్లో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం, వంటగది నిర్మాణ పనుల ను సంక్రాంతి లోగా పూర్తి చేయాలన్నారు. అన్ని స్కూల్ లలో ల్యాండ్ స్కేపింగ్ కు ప్లాన్ చేయాలన్నారు.మోడల్ స్కూల్ లో పెండింగ్ పనులను జనవరి 5 వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు.

అన్ని పనులు పూర్తయ్యాకే పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు.

జనవరి తర్వాత ఒక్క సివిల్ వర్క్ పెండింగ్ లో ఉండొద్దనీ చెప్పారు.మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టే పనులకు నిధులకు కొరత లేదని,బిల్లులు సమర్పించిన వెంటనే నిధులను విడుదల చేస్తామని అన్నారు.పనుల పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి ధనాలకోట రాధా కిషన్, ఇరిగేషన్ కార్యనిర్వాక ఇంజనీర్ అమరేందర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



# యువత భవితే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం బాటలు!




న్యూఢిల్లీ, డిసెంబర్ 29:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు యువతలో కొత్త ఆశలను నింపాయని కేంద్ర సైన్స్-టెక్నాలజీ శాఖ సహాయ (స్వతంత్ర హోదా) మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దేశ యువత భవితకోసం ప్రభుత్వం గత ఎనిమిదిన్నర ఏళ్లలో అనేక మార్గాలను సృష్టించిందని అన్నారు. స్వతంత్ర హోదాతో కూడిన సహాయమంత్రిగా భూగోళ శాస్త్రాలు, ప్రధాని కార్యాలయ వ్యవహారాలు, సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్ల వ్యవహారాలు, అణుశక్తి, అంతరిక్ష శాఖలను ఆయన పర్యవేక్షిస్తున్నారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, గజ్రౌలాలోని వెంకటేశ్వర యూనివర్సిటీలో "కొత్త యువ వోటర్లతో సంవాదం" పేరిట జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ప్రపంచ దేశాల కూటమిలో భారతదేశ ఖ్యాతి పెరిగిందని, భారతదేశాన్ని అర్థం చేసుకోవడానికి, అనుసంధానం కావడానికి ప్రపంచం మొత్తం ఇప్పుడు ఆసక్తిగా చూస్తోందని అన్నారు.

ప్రపంచం మొత్తం భారతదేశ యువతవైపు ఆశాభావంతో చూస్తోందని. ఎందుకంటే యువతే దేశానికి అభివృద్ధి ఛోదక శక్తి అని, భారతదేశం ప్రపంచ వృద్ధికి ఛోదకశక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ ఒక యువ స్నాతకోత్సవ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఈ సందర్భంగా ఉటంకించారు. విశాల దృక్పథానికి, భావిస్ఫోరక కార్యక్రమాలకు, ప్రగతిశీల అభిప్రాయాలకు నవభారతదేశం ప్రసిద్ధి చెందిందని అన్నారు, మన దేశ అభివృద్ధి యువత భుజస్కందాలపై ఆధారపడి ఉందని అన్నారు.

అనేక దశాబ్దాలుగా దేశంలో అస్థిర ప్రభుత్వాలు, సంకీర్ణ ప్రభుత్వాలు ఉన్నాయని, ఇవి భారత భవిష్యత్తుపై ప్రజల్లోనే కాకుండా ప్రపంచత దేశాల్లో కూడా భయాందోళనలకు కారణమయ్యాయని జితేంద్ర సింగ్ యువ ఓటర్లకు గుర్తు చేశారు. కానీ, 2014లో, భారతదేశంలోని ప్రజలు స్థిరమైన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, విధానాల్లో పని సంస్కృతిలో ఈ ప్రభుత్వం సుస్థిరతను తీసుకువచ్చిందని, మార్పుకు బలమైన పునాది వేసిందని అన్నారు.

2015 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఎర్రకోట బురుజునుంచి "స్టార్ట్-అప్ ఇండియా స్టాండ్ అప్ ఇండియా" కోసం ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని, దీనితో భారతదేశం భవిష్యత్తు దార్శనికతకు పూర్తి విశ్వసనీయత ఏర్పడిందని అన్నారు. దీని ఫలితంగా భారతదేశంలో 2014లో కేవలం 350గా ఉన్న స్టార్టప్‌ల సంఖ్య 2022లో 85 యునికార్న్ స్థాయి సంస్థలతో కలిసి మొత్తం 80,000కి పెరిగిందని అన్నారు.

"ఈ శతాబ్దాన్ని భారతదేశం వశం చేయడానికి, మనదేశ యువత విద్యతో పాటు నైపుణ్యంలోనూ సమానంగా ప్రావీణ్యం పొందడం అత్యవసరం" అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలతో సృజనాత్మక మార్గంలో మొదటి అడుగు వేస్తున్నారని అన్నారు. ఇక రేపటి వారి ప్రయాణం మరింత సృజనాత్మకంగా ఉంటుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు.

యువత నైపుణ్యాభివృద్ధికి, కొత్త సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. 1950వ సంవత్సరంలో దేశంలో తొలి పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐ.టి.ఐ.) నిర్మాణం తర్వాత ఏడు దశాబ్దాల్లో కేవలం 10 వేల ఐ.టి.ఐ.లు మాత్రమే ఏర్పాటయ్యాయని, అయితే, గత ఎనిమిదేళ్ల మోదీ ప్రభుత్వ హయాంలో దేశ వ్యాప్తంగా దాదాపు 5 వేల ఐ.టి.ఐ.లు ఏర్పడ్డాయని అన్నారు. గత 8 సంవత్సరాల్లో ఐ.టి.ఐ.లో 4 లక్షలకు పైగా కొత్త సీట్లు అందుబాటులోకి వచ్చాయని కేంద్రమంత్రి అన్నారు.

భారతదేశ పారిశ్రామిక విజయంలో పారిశ్రామిక శిక్షణా సంస్థల పాత్ర గొప్పదని జితేంద్ర సింగ్ అన్నారు. కోడింగ్, కృత్రిమ మేధోపరిజ్ఞానం (ఎ.ఐ.), రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, డ్రోన్ సాంకేతక పరిజ్ఞానం, టెలిమెడిసిన్ వంటి కొత్త కోర్సులను ఐ.ఐ.టి.లు అందిస్తున్నన్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.

సృజనాత్మక రంగాలు, స్టార్ట్-అప్‌లకు సంబంధించిన కొత్త ప్రాజెక్టులను చేపట్టడానికి వీలుగా ఉత్తరప్రదేశ్ యువతకు తన అజమాయిషీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ద్వారా అన్ని విధాలా సహాయాన్ని అందిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. టెక్నాలజీ అభివృద్ధి మండలి, బయోటెక్నాలజీ శాఖ నుంచి సీడ్ ఫండింగ్ ద్వారా సహాయం అందిస్తామని డాక్టర్ జితేంద్ర సంగ్ అన్నారు.

# ఎస్సీ,ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించడం కోసం ఒడిశాలోని మయూర్ భంజ్ లోని బరిపదాలో సదస్సు నిర్వహించిన నేషనల్ ఎస్సీ-ఎస్టీ హబ్



న్యూఢిల్లీ, డిసెంబర్ 29: వ్యవస్థాపకత్వం సంస్కృతిని ప్రోత్సహించడానికి మరియు ఎన్ఎస్ఎస్ హెచ్ పథకం,మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఇతర పథకాలపై అవగాహన కల్పించి, వ్యవస్థాపక సంస్కృతి ప్రోత్సహించడం కోసం ఒడిశాలోని మయూర్ భంజ్ లోని బరిపదాలో సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఎస్ఎంఇ) జాతీయ ఎస్సీ-ఎస్టీ హబ్ (ఎన్ఎస్ఎస్‌హెచ్) సదస్సు నిర్వహించింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా శ్రీ గిరీష్ చంద్ర ముర్ము మరియు ఎమ్ఎస్ఎంఇ సహాయ మంత్రి శ్రీ భాను ప్రతాప్ సింగ్ వర్మ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో సుమారు 700 మంది ఎస్సీ- ఎస్టీ ఔత్సాహిక వ్యవస్థాపకులు, ఇప్పటికే పరిశ్రమలు స్థాపించిన వారు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో శ్రీ ముర్ము ప్రసంగిస్తూ స్థూల దేశీయోత్పత్తి మరియు మొత్తం ఎగుమతుల రంగంలో సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. కేంద్ర ఎమ్ఎస్ఎంఇ సహాయ మంత్రి శ్రీ భాను ప్రతాప్ సింగ్ వర్మ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు. గ్రామీణ , వెనుక బడిన ప్రాంతాల పారిశ్రామికీకరణ కు ఎంఎస్ఎంఇ రంగం కీలక పాత్ర ను పోషిస్తుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎమ్ఇ రంగంలో సాధికారత సాధించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల వివరాలను ఆయన వివరించారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి చెందిన ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వినూత్నమైన ఆలోచనలు, పరస్పర వ్యాపార అవకాశాలను అన్వేషించి, ఈ పథకాల నుంచి గరిష్ట ప్రయోజనం పొందాలని ఆయన సూచించారు.

భారతదేశ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం సలహాదారు / శాస్త్రవేత్త 'జి' డాక్టర్ కేతకి బాపట్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సాంకేతిక సదస్సు జరిగింది. ఔత్సాహిక మరియు ఇప్పటికే ఉన్న ఎస్సీ-ఎస్టీ వ్యవస్థాపకులకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు , రుణ సంస్థలతో చర్చించడానికి సదస్సు అవకాశం కల్పించింది ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, మహానది కోల్ ఫీల్డ్ లిమిటెడ్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు,. సరఫరాదారులను గుర్తించడానికి, సేకరిస్తున్న ఉత్పత్తులు, సేవలు పొందడానికి తమ సంస్థ అనుసరిస్తున్న విధానం, ప్రక్రియ అంశాలను సంస్థల ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో యుకో బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ఆర్థిక సంస్థలు కూడా పాల్గొన్నాయి. ఎంఎస్ఎంఇ రంగానికి సంబంధించిన వివిధ రుణ పథకాలను ఆర్థిక సంస్థల ప్రతినిధులు వివరించారు. ఐఐటీ ఖరగ్పూర్, సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, భువనేశ్వర్, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వంటి శిక్షణా సంస్థలు కూడా స్టాల్ ఏర్పాటు చేసి వారి సాంకేతిక మరియు వివిధ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను ఈ కార్యక్రమంలోవివరించారు. ఉదయం పథకంలో సులువుగా ఎస్సీ,ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నమోదు చేసుకోవడానికి సదస్సులో ఏర్పాటు చేశారు. .

ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, ఒడిశా రాష్ట్ర సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. సమ్మిళిత వృద్ధి కోసం, ఎస్ సి-ఎస్ టి వర్గాలలో వ్యవస్థాపకత సంస్కృతిని ప్రోత్సహించడానికి ఎన్ఎస్ఎస్ హెచ్ పథకం కింద అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, సేకరణలో 4% ఉత్పత్తులను ఎస్సీ-ఎస్టీ వర్గాలకు చెందిన సంస్థల నుంచి తప్పనిసరిగా సేకరించాలన్న ఆదేశాలు కూడా సదస్సులో చర్చకు వచ్చాయి.

# హైకోర్టులో బీఆర్ఎస్ నేత రోహిత్ రెడ్డికి గట్టి ఎదురుదెబ్బ

**- ఈడీ దర్యాప్తుపై స్టే ఇవ్వడానికి నిరాకరించిన తెలంగాణ హైకోర్టు**

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన కేసును సీబీఐకి అప్పగిస్తూ కేసీఆర్ సర్కార్ కు షాకిచ్చిన హైకోర్టు అదే సమయంలో ఈ కొనుగోలు కేసులో బాధితుడిగా ఉన్న బీఆర్ఎస్ రోహిత్ రెడ్డికి మాత్రం గట్టి ఎదురుదెబ్బ తగిలేలా చేసింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఈడీ దర్యాప్తుపై స్టే ఇవ్వడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది.

ఈడీ విచారణ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న రోహిత్ రెడ్డి అభ్యర్థనను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈనెల 30న హాజరు కావాలని ఈడీ ఇచ్చిన నోటీసులపై జోక్యం చేసుకోవడానికి కోర్టు నిరాకరించింది. ఈడీ కేసు కొట్టివేయాలని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి హైకోర్టులో పిటీషన్ వేశారు. ఈ పిటీషన్ పై జస్టిస్ కే.లక్ష్మణ విచారణ చేపట్టారు. తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి తరుపున వైసీపీ ఎంపీ సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదించారు. పార్టీ మారాలని రోహిత్ రెడ్డికి వందకోట్లు ఆఫర్ ఇచ్చారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆఫర్ మాత్రమే ఇచ్చారని.. డబ్బు ఇవ్వలేదన్న వాదనలు వినిపించారు. ఆర్థిక లావాదేవీలు జరగలేదు కనుక ఈడీకి విచారణ పరిధి లేదన్నారు. ఈడీ ఈసీఐఆర్ మనీలాండరింగ్ చట్టానికి విరుద్ధమని వాదించారు.

వ్యక్తిగత వివరాల కోసం ఈడీ తనను వేధిస్తోందన్న రోహిత్ రెడ్డి వాదనలు విన్న హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశించింది.

తదుపరి విచారణను జనవరి 5కు వాయిదా వేసింది. మంగళవారం రోహిత్ రెడ్డి ఈడీ విచారణకు హాజరుకాలేదు. ఈ కేసులో ఈడీ అధికారులు ఇప్పటికే రోహిత్ ను రెండు రోజుల పాటు ప్రశ్నించారు. మంగళవారం మరోసారి విచారణకు రావాలని పిలిచారు. కానీ ఆయన విచారణకు వెళ్లలేదు. ఈ కేసును హైకోర్టు సీబీఐకి అప్పగించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం అప్పీల్ కు వెళ్లాలా లేక సుప్రీంకోర్టుకు వెళ్లాలా ప్రభుత్వం నిర్ణయించలేదు. బీజేపీ కొత్త కుట్రలకు తెరలేపింది అని.. ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ను రంగంలోకి దింపి తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని.. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా తాను మాత్రం తగ్గేది లేదని పైలట్ రోహిత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అందుకు ఊతమిస్తాయి.

# విద్యపై ఏకాగ్రత పెంచుకొని గొప్ప వ్యక్తులుగా ఎదగాలి

**- పి ఎస్ వి జి ఫౌండేషన్ అధ్యక్షులు పాలకూర మురళి**

చౌటుప్పల్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);చౌటుప్పల్ మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం నారాయణపురం నందు పీపుల్ ఫర్ ఇందిరా సౌజన్యంతో లీడ్ విత్ వాల్యూస్ లో భాగంగా పి ఎస్ వి జి ఫౌండేషన్ అధ్యక్షులు పాలకూర మురళి గెస్ట్ లెక్చర్ ఇవ్వడం జరిగింది. ఆయన విద్యార్థుల నిర్దేశించి మాట్లాడుతూ ఎలా చదువుకుంటే ముందంజలో ఉంటారనేది గోల్డ్ సెట్టింగ్ టైమ్ మేనేజ్మెంట్ అంశాలను క్లుప్తంగా వివరించారు ట్రస్ట్ సభ్యురాలు తను శ్రీ సివిల్స్ ప్రిపేర్ అవుతూనే చైతన్యం నింపేలా విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగిఉంచారు. అన్ని రంగాల్లో ముందు ఉండాలని ఆటల్లో ప్రతిభ కనబరచాలని విద్యపై ఏకాగ్రత పెంచుకొని గొప్ప వ్యక్తులుగా ఎదగాలని తెలుపుతూ స్పీచ్ ఇచ్చారు.క్విజ్ టాలెంట్ టెస్ట్ కాంపిటీషన్ నిర్వహించారు ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. దీనితో పాటు కేజీబీవీ నారాయణపురం నుండి జాతీయస్థాయిలో రన్నింగ్ 1600 మీటర్లు ఆడడానికి ఎంపికైన వైరు వరలక్ష్మి ఏడో తరగతి విద్యార్థిని అభినందించి 3000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.



ఇలాగే ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ ఎం శివరంజని తెలుగు సి ఆర్ టిపి కరుణ తదితరులు పాల్గొన్నారు

# జూలై-సెప్టెంబర్ 2022 సంబంధించి పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ త్రైమాసిక నివేదిక విడుదల

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని.. ఆర్థిక వ్యవహారాల శాఖ బడ్జెట్ విభాగం జూలై-సెప్టెంబర్ 2022 మధ్య కాలానికి సంబంధించిన పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్‌పై త్రైమాసిక నివేదికను విడుదల చేసింది. ఏప్రిల్-జూన్ (క్యూ1) 2010-11 నుండి బడ్జెట్ విభాగం పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ సెల్ (పీడీఎంసీ) క్రమం తప్పకుండా ఉండే ప్రాతిపదికన రుణ నిర్వహణపై త్రైమాసిక నివేదికను విడుదల చేస్తోంది. ప్రస్తుతం జూలై-సెప్టెంబర్ (క్యూ2 ఈజ23) త్రైమాసికానికి సంబంధించిన నివేదికను వెలువరించింది. 2023 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కేంద్ర ప్రభుత్వం డేటెడ్ సెక్యూరిటీల ద్వారా రూ.4,06,000 కోట్ల విలువైన మొత్తాన్ని సేకరించింది, రుణం క్యాలెండర్‌లో నోటిఫైడ్ మొత్తం రూ.4,22,000 కోట్లు. రుణ తిరిగి చెల్లింపులు రూ.92,371.15 కోట్లుగా ఉన్నాయి. ప్రాథమిక జారీల సగటు దిగుబడి 2023 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 7.23 శాతం నుండి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 7.33 శాతానికి చేరింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంను (క్యూ2) డేటెడ్ సెక్యూరిటీల జారీ వెయిటెడ్ యావరేజ్ మెచ్యూరిటీ 15.62 సంవత్సరాల దిగువకు చేరింది. అంతకు ముందు త్రైమాసికంలో డేటెడ్ సెక్యూరిటీల జారీ వెయిటెడ్ యావరేజ్ మెచ్యూరిటీ 15.69గా నిలిచింది. జూలై-సెప్టెంబర్ 2022లో కేంద్ర ప్రభుత్వం నగదు నిర్వహణ బిల్లుల ద్వారా ఎలాంటి మొత్తాన్ని సేకరించలేదు. త్రైమాసికంలో ప్రభుత్వ సెక్యూరిటీల కోసం రిజర్వ్ బ్యాంక్ ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలను నిర్వహించలేదు. ఈ త్రైమాసికంలో మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ మరియు స్పెషల్ లిక్విడిటీ ఫెసిలిటీతో సహా లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ (ఎల్ఏఎఫ్) కింద భారతీ రిజర్వు బ్యాంక్ నికర రోజువారీ సగటు లిక్విడిటీ శోషణ రూ.1,28,323.37 కోట్లుగా నిలిచింది. అందుబాటులో ఉన్న

తాత్కాలిక డేటా ప్రకారం ప్రభుత్వం యొక్క మొత్తం స్థూల బాధ్యతలు ('పబ్లిక్ ఖాతా' కింద బాధ్యతలతో సహా) జూన్ 2022 చివరి నాటికి రూ.1,45,72,956 కోట్ల నుండి 2022 సెప్టెంబర్ చివరి నాటికి రూ.1,47,19,572.2 కోట్లకు పెరిగాయి. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో 1.0 శాతం పెరుగుదలను సూచిస్తుంది. జూన్ 2022 చివరి నాటికి 88.3 శాతంగా ఉన్న స్థూల బాధ్యతలలో పబ్లిక్ రుణం సెప్టెంబర్ 2022 చివరి నాటికి 89.1 శాతానికి చేరింది.

ఇందులో దాదాపు 29.6 శాతం గడువు తేదీ ఉన్న సెక్యూరిటీలు 5 సంవత్సరాల కంటే తక్కువ కాల వ్యవధిని కలిగి ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో ఎక్కువ కాల వ్యవధి సెక్యూరిటీల కోసం మెరుగ్గా ఉండి సరళంగా ఉన్నప్పటికీ, సమీప-కాల ద్రవ్యోల్బణం మరియు లిక్విడిటీ ఆందోళనల కారణంగా సెకండరీ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీలపై స్వల్పకాలిక వక్రతను తీసుకున్నాయి. ఎంపీసీ ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలనే ఉద్దేశ్యంతో 2023 ఆర్థిక సంవత్సరం క్యూ2లో పాలసీ రెపో రేటును 100 బీపీఎస్, అంటే 4.90% నుండి 5.90% వరకు పెంచాలని నిర్ణయించింది. సెకండరీ మార్కెట్ త్రైమాసిక ట్రేడింగ్ కార్యకలాపాలు 7-10 సంవత్సరాల మెచ్యూరిటీ బకెట్‌లో కేంద్రీకృతమై ఉన్నాయి. ప్రధానంగా 10 సంవత్సరాల బెంచ్‌మార్క్ సెక్యూరిటీలో ఎక్కువ ట్రేడింగ్ గమనించబడింది. ఈ త్రైమాసికంలో సెకండరీ మార్కెట్‌లో ప్రైవేట్ రంగ బ్యాంకులే ఆధిపత్య ట్రేడింగ్ సెగ్మెంట్‌గా అవతరించాయి. నికర ప్రాతిపదికన, విదేశీ బ్యాంకులు మరియు ప్రైమరీ డీలర్లు నికర అమ్మకందారులుగా నిలిచారు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, సహకార బ్యాంకులు, ఎఫ్ఐలు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్‌లు, ప్రైవేట్ రంగ బ్యాంకులు మరియు 'ఇతరులు' సెకండరీ మార్కెట్‌లో నికర కొనుగోలుదారులుగా ఉన్నారు. జూన్ 2022న వాణిజ్య బ్యాంకుల వాటా 38.04 శాతం నుండి 2022 సెప్టెంబర్ చివరి నాటికి 38.3 శాతంగా నిలిచిందని కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల యాజమాన్య విధానం సూచిస్తుంది.

పూర్తి నివేదికను చూసేందుకు గాను ఇక్కడ క్లిక్ చేయండి: జూలై-సెప్టెంబర్ 2022 మధ్య కాలానికి సంబంధించిన పబ్లిక్ రుణ మేనేజ్‌మెంట్ త్రైమాసిక నివేదిక

# తమిళనాడులో పట్టణ సేవలను మెరుగుపరచడానికి ₹ 125 మిలియన్ల రుణంపై సంతకం చేసిన భారతదేశం, ఏడిబి

న్యూఢిల్లీ, డిసెంబర్ 29:తమిళనాడు రాష్ట్రంలోని మూడు నగరాల్లో వాతావరణాన్ని తట్టుకోగలిగే మురుగునీటి సేకరణ మరియు శుద్ధి, డ్రైనేజీ మరియు నీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం మరియు ఆసియా డెవలప్‌మెంట్‌బ్యాంక్ (ఏడిబి) ఈరోజు ₹125 మిలియన్ల రుణంపై సంతకం చేశాయి.

తమిళనాడు అర్బన్ ఫ్లాగ్‌షిప్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రామ్ కోసం ఈ 3వ విడత రుణానికి భారత ప్రభుత్వం తరపున ఆర్థిక వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రా మరియు ఏడిబి ఇండియా రెసిడెంట్ మిషన్ ఇన్ చార్జ్ అధికారి హో యున్ జియోంగ్ లు సంతకం చేశారు.

రాష్ట్రంలోని 10 నగరాల్లో వ్యూహాత్మక పారిశ్రామిక కారిడార్‌లలో నీటి సరఫరా, మురుగునీటి పారుదల మరియు నీటి పారుదల మౌలిక సదుపాయాలను ప్రాధాన్యతగా నిర్మించడానికి 2018లో ఏడిబి ఆమోదించిన కార్యక్రమానికి ₹500 మిలియన్ల మల్టీ-ట్రాంచ్ ఫైనాన్సింగ్ ఫెసిలిటీ (ఎంఎఫ్ఎఫ్)లో ఇది మూడవ మరియు చివరి విడత. 3వ విడత రుణం కోయంబత్తూర్, మధురై మరియు తూత్తుకుడిలను కవర్ చేస్తుంది.

రుణ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత మిశ్రా మాట్లాడుతూ "ఏడిబి ఫైనాన్సింగ్ ప్రాథమిక నీరు మరియు పారిశుద్ధ్య సేవలకు సార్వత్రిక ప్రాప్యతను నిర్ధారించడానికి మరియు తమిళనాడు పారిశ్రామిక కేంద్రాలుగా ఉన్న ప్రాజెక్ట్ లక్ష్య ప్రాంతాలలో వరదల నుండి కాపాడుతుంది." అని తెలిపారు.

"ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏడిబి..బిల్డ్, ఆపరేట్ మోడాలిటీ, బల్క్ వాటర్ వినియోగదారులకు ఆటోమేటిక్ మీటర్లు మరియు పర్యవేక్షక నియంత్రణ మరియు డేటా సేకరణ వ్యవస్థల ద్వారా నిజ సమయ పర్యవేక్షణ వంటి కొత్త విధానాలను అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో పట్టణ సేవలను అభివృద్ధి చేయడం మరియు మెరుగుపరచడంలో మద్దతునిస్తుంది" అని మిస్టర్ జియోంగ్ తెలిపారు. "ఏడిబి పట్టణ పెట్టుబడులు తమిళనాడులో వ్యూహాత్మక పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి మద్దతును అందిస్తాయని" వివరించారు.

కోయంబత్తూర్‌లో 529 కిలోమీటర్ల మురుగునీటి సేకరణ పైప్‌లైన్‌లు కలిగిన రెండు మురుగునీటి శుద్ధి కర్మాగారాల అభివృద్ధికి 14 పంప్ మరియు లిఫ్ట్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడానికి మరియు 14 కిలోమీటర్ల మురుగు పంపింగ్ మెయిన్‌లను నిర్మించడానికి ఈ ఫైనాన్సింగ్ తోడ్పడుతుంది. తూత్తుకుడిలో వాతావరణాన్ని తట్టుకోగలిగే మురుగునీటి పారుదల వ్యవస్థను అభివృద్ధి చేస్తారు.

మధురైలో స్మార్ట్ వాటర్ ఫీచర్‌లతో 163,958 గృహాలను కొత్తగా ఏర్పాటు చేసిన 115 జిల్లాల మీటర్ల ప్రాంతానికి అనుసంధానించే 813 కి.మీ కొత్త నీటి సరఫరా పంపిణీ పైప్‌లైన్‌ల ప్రారంభానికి ఈ ప్రాజెక్ట్ మద్దతు ఇస్తుంది. కోయంబత్తూరు మరియు మదురైలో మురుగునీటి సేకరణ వ్యవస్థ, నీటి సంరక్షణ, పారిశుద్ధ్యం మరియు ఆరోగ్యం మరియు పరిశుభ్రతతో గృహ కనెక్షన్ ప్రయోజనాలపై రెండు మహిళా స్వయం సహాయక బృందాలకు శిక్షణ ఇవ్వబడుతుంది.

